క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఇందుకూరుపేట: మండల నూతన తహసీల్దార్‌గా జి.రమేష్‌కుమార్ తన కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ సుబ్బయ్య పరుచూరి మండలానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌కుమార్‌ను డీటీ బషీర్, ఆర్ఐ జీవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది కలిసి పరిచయం చేసుకున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని బారాషాహీద్ దర్గా సమీపంలో సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

స్టోన్‌హౌస్‌పేటలో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బాలాజీనగర్ నుంచి స్టోన్‌హౌస్‌పేటకు మార్చారు. ఇక్కడి రేబాలవారివీధిలోని లక్ష్మీనరసారెడ్డి చిన్నపిల్లల ఆస్పత్రి క్వార్టర్స్‌లో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కార్యకలాపాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి.

రేపు ఉచిత అక్షరాభ్యాసం

నెల్లూరు(బృందావనం): శ్రీపంచమిని పురస్కరించుకుని బాలాజీనగర్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కురవాడ లలితమ్మ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసం ఉచితంగా చేయనున్నట్లు ఆలూరు శిరోమణిశర్మ సోమవారం తెలిపారు. అక్షరాభ్యాసం సందర్భంగా పలక, బలపం అందజేయనున్నట్లు చెప్పారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించదలచిన తల్లిదండ్రులు 94913 53229 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

16 నుంచి పుష్కర కుంభాభిషేక ఉత్సవాలు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని కసుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి మూడ్రోజుల పాటు పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న మహాగణపతిపూజ, తీర్థ సంగ్రహణం, విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 17న అష్టబంధన సమర్పణ, విశేష సుబ్రహ్మణ్యేశ్వర సహిత సర్వమంత్ర హోమం, జంట నాగదేవతలకు అభిషేకం, మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న రుద్ర హోమం, పూర్ణాహుతి, ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 36 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శిల్పానికి మహాకుంభాభిషేక పూజలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, మయూర వాహనసేవ ఉంటాయని వివరించారు.

సీసీఎస్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు సీసీఎస్ డీఎస్పీగా పీ రామకృష్ణాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ జిల్లాలో నేరాల కట్టడికి తనవంతు కృషి చేస్తామన్నారు. నేరస్తుల కదలికలపై నిశిత నిఘా పెడుతామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులు తమ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు ప్రజలు గుర్తిస్తే డయల్ 112 లేదా సీసీఎస్ పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా డీఎస్పీ పీ రామకృష్ణాచారిది అనంతపురం జిల్లా. ఆయన 1995లో పోలీసుశాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లాలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వహించారు. ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు. పనిచేసిన ప్రతిచోట శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

అష్టలక్ష్మిని దర్శించుకున్న సతీష్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలో కొలువైన అష్టలక్ష్మిని భారత రక్షణ శాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు మస్తాన్‌రెడ్డి, ప్రవీణ్, కొల్లం సురేష్ తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సతీష్‌రెడ్డికి ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

సంక్షేమం, అభివృద్ధే మా ఆయుధాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే మా ఆయుధాలు. వాటిని చూపించే ఓట్లు అడుగుతాం' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని టోల్‌గేట్ వద్దనున్న వీజీ కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ రెండు నెలలు చాలా కీలకమన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా బాధ్యతలు తీసుకున్న వారు వైఎస్సార్‌సీపీ గెలుపునకు బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వివరించారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరాలని వస్తే సాదరంగా ఆహ్వానించాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

బుచ్చి మండలంలో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాల ద్వారా ప్రజలకు ఇప్పటి వరకు రూ.514.19 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు ప్రసన్న తెలిపారు. మండలంలో 17 లేఅవుట్లలో 1,110, నగర పంచాయతీ పరిధిలో 2,300 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వివిధ వ్యవసాయ భూములకు సంబంధించి రైతులకు 4,128 భూహక్కు పత్రాలు అందించామన్నారు. రూ.85 కోట్లతో ఎస్ఎస్సార్ తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశామన్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, త్వరలోనే నగర పంచాయతీ పరిధిలో 10 వేలకు పైగా కుళాయి కనెక్షన్లు ఇవ్వబోతున్నామని వివరించారు. ఇటీవల కొందరు వ్యక్తులు వలంటీర్లకు ఫోన్లు చేసి రూ.50 వేలు ఆఫర్ చేశారన్నారు. వాళ్ల మాటల్ని తమ వలంటీర్లు నమ్మరన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, టౌన్, రూరల్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సీహెచ్ సతీష్‌రెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయండి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసులురెడ్డి

మనుబోలు : జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్ పురోగతిపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా జల్‌జీవన్ పనులు జరుగుతాయని తెలిపారు. ఇందు కోసం కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీల్లో తొమ్మిది మంది పొదుపు సంఘాల సభ్యులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారని వివరించారు. ప్రస్తుతం మండలంలోని ఎనిమిది గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నట్లు తెలియజేశారు. పనుల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జల్‌జీవన్ మిషన్ కోఆర్డినేటర్ శర్మ, ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఎం వనజాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రంలో వర్సిటీ బోర్డు సభ్యులు



విత్తనాలను పరిశీలిస్తున్న వర్సిటీ బోర్డు సభ్యులు

పొదలకూరు : ఎన్జీరంగా వర్సిటీ బోర్డు సభ్యులు బి.శ్రీనివాసులురెడ్డి, ఎం.మల్లికార్జునరెడ్డి పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగు వివరాలను ప్రధాన శాస్త్రవేత్త ఒ.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. నీటి వసతి తక్కువగా ఉన్న కారణంగా పంట సాగు అనుకున్న స్థాయిలో చేపట్టలేకపోయినట్లు వెల్లడించారు. ఇక్కడే ఉన్న వ్యవసాయ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ వసతి గృహాన్ని బోర్డు సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థినులతో సమావేశమై వసతుల గురించి తెలుసుకున్నారు. విత్తన శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అవసరమైన మినుము, పెసర విత్తనాల విక్రయ వివరాలపై ఆరాతీశారు. విత్తనాల నాణ్యతా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పరిశోధన స్థానంలోని శాస్త్రవేత్తలు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మనుబోలు : మనుబోలులో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చిరంజీవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుబోలు పరిధిలో ఉన్న పది పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉన్నాయా.. లేదా? అని పరిశీలించామని, ఇక్కడ తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర వసతులను సమకూర్చినట్లు తెలిపారు. అలాగే వృద్ధులు, వికలాంగులు సులభంగా చేరుకునేందుకు వీలుగా ర్యాంప్‌లు లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట మనుబోలు వీఆర్వో నాగార్జునరెడ్డి ఉన్నారు.

విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చలపతిరావు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శేషారెడ్డి గోడౌన్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ నేతలంతా తరలిరావాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెంలోని సభా ప్రాంగణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున విస్తృత స్థాయి సమావేశంలో కీలక విషయాలపై చర్చిస్తామన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డు మంగలకట్ట, కోనేటిమిట్టకు చెందిన 60 మంది టీడీపీ కార్యకర్తలు సోమవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వీజీ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని వారు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం మండల పరిధిలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు పాపిరెడ్డిపాళెం, 12 గంటలకు కోవెరపాళెం పంచాయతీల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో మంత్రి కాకాణి పాల్గొంటారన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పొదలకూరు : మండలంలోని అమ్మవారిపాళెం ఎస్సీ కాలనీలో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సంస్థ వారు ఆర్థిక అక్షరాస్యత-పొదుపు, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు షేక్ నౌరాజ్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతాలు ఉన్న వారు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాల్సిందిగా సూచించారు. ప్రస్తుతం ఆర్థిక మోసాలు అధికమయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ మేనేజర్ ఓంకారం, సంస్థ కో-ఆర్డినేటర్ గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు తహసీల్దార్

పొదలకూరు : విజయవాడలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఎన్నికల శిక్షణ తరగతులకు తహసీల్దార్ కె.వీరవసంతరావు వెళ్లారు. ఆయన తిరిగి శుక్రవారం హాజరవుతారు. అప్పటి వరకు డీటీ శివబాలకృష్ణయ్య ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తారు.

మంత్రి కాకాణి పరామర్శ

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మంచు పెద్ద వెంకటేశ్వర్లు నాయుడు భార్య పావని(60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం రాత్రి తిక్కవరప్పాడుకు చేరుకుని పావని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ద వెంకటేశ్వర్లు నాయుడుతో పాటు ఆయన కుమారుడు శ్రీనివాసులు నాయుడులను మంత్రి పరామర్శించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

కోవూరు : స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ మండల ఆత్మీయ సమావేశం మంగళవారం ఉదయం జరుగుతుందని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

కోవూరు సీహెచ్‌సీలో అరుదైన ఆపరేషన్

కోవూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేట్ వైద్యశాలల్లో చేసే అరుదైన ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ కింద సోమవారం ఉచితంగా చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ వెల్లడించారు. కోవూరుకు చెందిన 31 ఏళ్ల వివాహితకు మూడేళ్ల క్రితం ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. ఈ నేపథ్యంలో ఆమెకు ఇన్‌సేషనల్ హెర్నియా సోకింది. వాస్తవంగా ఈ ఆపరేషన్లు కేవలం కార్పొరేట్ వైద్యశాలల్లో మాత్రమే చేస్తారు. అటువంటి అరుదైన ఆపరేషన్ను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్ చేసి విజయవంతం చేశారు. ఉత్తమ సేవలు అందించడంలో కోవూరు సీహెచ్‌సీ రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో కొనసాగుతోందని డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోండి

- ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్



సర్వసభ్య సమావేశంలో అధికారులు

కొడవలూరు: జగనన్న గృహ రిజిస్ట్రేషన్‌లు వేగవంతంగా జరుగుతుండడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గృహాలకు సంబంధించి లబ్ధిదారుకు సర్వ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేయడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రభుత్వం ప్రతి పేదవాడికి స్థిరాస్తి ఉండాలన్న ఉద్దేశంతో పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ ఇచ్చిన నివేశన స్థలంతో పాటు గృహ రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన బృహత్తర కార్యక్రమం అని, దీనివల్ల కులాల వారీగా ఉన్న జనాభా ప్రకారం ప్రభుత్వ పథకాలను అందిస్తుందన్నారు. కొందరు అందుబాటులో లేనందున కులగణన ఇంకా పూర్తి కాలేదన్నారు. మిగిలిన వారు కూడా వివరాలను నమోదు చేయించుకుని కులగణనకు సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఇంటికీ తాగు నీరందించాలన్న ఉద్దేశంతో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నామని, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే ప్రక్రియ శరవేగంగా జరుగుతోందని చెప్పారు. ట్రాన్స్‌కో ఏఈ ఎం.రాములు మాట్లాడుతూ ఓల్టేజీ సమస్య ఉన్న గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈఓపీఆర్డీ వి.డేవిడ్, డీటీ శైలజాకుమారి, హౌసింగ్ ఏఈ మాధవయ్య, ఏఓ లక్ష్మి, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆపన్నహస్తం



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు హరిజనవాడలో తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ తరఫున కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. కె.అనూష, కె.అద్విక్‌లకు రూ.20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్లను నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు ప్రదీప్, పాలిచర్ల రాజారెడ్డి, చంద్రమౌళి ఉన్నారు.

కసుమూరులో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాచలం : మండలంలోని కసుమూరు గ్రామ సచివాలయంలో అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ నవీన్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్యుడు గౌతమ్‌రెడ్డి, ఇతర సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఆరోగ్య నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

మర్యాదపూర్వకంగా..



మంత్రి కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పార్థు

మనుబోలు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎంపికైన మనుబోలు గ్రామానికి చెందిన గురివిందపూడి పార్థు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిజాయతీగా పనిచేస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పార్టీలో పదవి ఇచ్చినందుకు మంత్రి కాకాణికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

సూరాపై ఎస్పీకి ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వవ్వేరు బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి తన దగ్గర రూ.36 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఓ వ్యక్తి సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న దారా రమణయ్య తన కున్న ప్లాట్లు అమ్మగా వచ్చిన రూ.36 లక్షలను 2022వ సంవత్సరంలో సూరా శ్రీనివాసులురెడ్డి తన కుమార్తె ఉన్నత చదువుల నిమిత్తం అడిగితే అప్పుగా ఇచ్చారు. అందుకు షూరిటీగా ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకున్నారు. అయితే ఆ పత్రాలు నకిలీవని తేలిందని, తన డబ్బులు ఇవ్వాలని పలుమార్లు శ్రీనివాసులురెడ్డిని అడిగినా ఎలాంటి లాభం లేకుండా పోయిందని బాధితుడు వాపోయాడు. అంతే కాకుండా కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని ఎస్పీని రమణయ్య కోరారు.

దర్జాగా కబ్జా

- రోడ్డు స్థలాన్ని ప్రైవేటు లేఅవుట్‌లో కలిపేసుకున్న వైనం
- యథేచ్ఛగా ప్రహరీ నిర్మాణం
- నోటీసులు జారీ చేస్తామన్న పంచాయతీ సెక్రటరీ



రోడ్డు పక్కన చదును చేసిన గ్రావెల్‌ను తవ్వేసిన దృశ్యం



రోడ్డు పక్కనే లేఅవుట్ నిర్వాహకులు చేపట్టిన కాంపౌండ్ వాల్, సైడ్ డ్రెయిన్ల నిర్మాణం

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామానికి వెళ్లే బ్రాంచి రోడ్డు పక్కనున్న స్థలాన్ని కొత్తగా లేఅవుట్ వేసిన వారు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇటీవల మార్కెటింగ్ శాఖ నిధులతో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో మొగళ్లూరు గ్రామానికి సిమెంటురోడ్డును నిర్మించి ఇరువైపులా వైడింగ్ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో వనంతోపు సెంటర్ వద్ద మొగళ్లూరుకు వెళ్లే రోడ్డు పక్కనే ప్రైవేటు లేఅవుట్ నిర్మాణం జరిగింది. మండలం నుడా పరిధిలో ఉండడంతో అధికారులు లేఅవుట్ చుట్టూ కాంపౌండ్ వాల్‌తో పాటు సైడ్‌డ్రెయిన్లు, 40 అడుగుల విస్తీర్ణంతో అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో లేఅవుట్ నిర్వాహకులు కాంపౌండ్ వాల్ నిర్మిస్తూ రోడ్డు పక్కనున్న స్థలాన్ని ఆక్రమించారు. అంతటితో ఆగకుండా రోడ్డు పక్కన చదును చేసిన గ్రావెల్‌ను ఇష్టానుసారం తవ్వేశారు. సుమారు 4 మీటర్ల వరకు రోడ్డు పోరంబోకు స్థలాన్ని కలిపేసుకున్నట్లు గ్రామస్తులు, పంచాయతీ సెక్రటరీ పరిశీలించి వెల్లడించారు. అంతేకాక లే-అవుట్ లోపల సైడ్‌డ్రెయిన్ నిర్మించాల్సి ఉండగా వెలుపల రోడ్డుపక్కన సైడ్‌డ్రెయిన్ పనులను చేపట్టారు. దీంతో గ్రామస్తులు లేఅవుట్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వల్ల చక్కటి సిమెంటురోడ్డు నిర్మిస్తే ఆ స్థలాన్ని ఎలా ఆక్రమిస్తారని ప్రశ్నించారు. ఈ లేఅవుట్ నుడా పరిధిలో ఉన్నా ముందుగా పంచాయతీకి సమాచారం అందజేసి తీర్మానం తీసుకోవాల్సి ఉంటుందని, ప్రాథమికంగా ఎలాంటి అనుమతులు పొందలేదని ఆర్‌వైపాళెం సెక్రటరీ బాలకృష్ణయ్య తెలిపారు. పరిశీలించి వెంటనే నోటీసులు అందజేస్తామని ఆయన వెల్లడించారు.

రోడ్డును పరిశీలిస్తాం

" లేఅవుట్ నిర్వాహకులు మొగళ్లూరు పీఆర్ రోడ్డు పక్కనున్న స్థలాన్ని ఆక్రమించారని గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. దీనిపై వెంటనే వెళ్లి పరిశీలిస్తాం. కొలతలు వేయించి రోడ్డు స్థలం అయితే చర్యలు తీసుకుంటాం. కాంపౌండ్ వాల్, సైడ్ డ్రెయిన్ పనులు నిలిపి వేయాల్సిందిగా సమాచారం అందించాం.

– మవేక్‌రెడ్డి, పీఆర్ ప్రాజెక్ట్, ఏఈ